## 2. చిన్న సహాయం

ఓ ముసలతను సముద్రం ఒడ్డున నిలబడి కెరటాలతో కొట్టుకు వచ్చి, ఒడ్డున పడి గిలగిల కొట్టుకుంటున్న చేపలని తీసి నీళ్ళల్లోకి విసరసాగాడు. ఇది గమనించిన ఒకతను అడిగాడు.

"ఏం చేస్తున్నావు తాతా?"

"చూస్తున్నావుగా. అలలు ఎత్తుగా వస్తున్నాయి కాబట్టి చేపలు పాపం ఒడ్డు మీదకి నీళ్ళతో జారి పడిపోయి వెనక్కి వెళ్ళలేక మరణిస్తున్నాయి. వాటిని తిరిగి సముద్రంలో పడేసి బ్రతికిస్తున్నాను."

"ఒక్కో అల వందలకొద్దీ చేపలని తెచ్చి పడేస్తోంది. వాటన్నిటినీ రక్షించడం నీవల్ల కాదు తాతా." చెప్పాడతను.

ఆ ముసలాయన అతని మాటలకి నవ్వుతూ వంగి రెండు చేతులతో రెండు చేపలని తీసుకుని నీళ్ళల్లోకి విసిరేసి చెప్పాడు.

"ఈ రెండూ ఇక చావవు."

(చేయగలిగే చిన్న సహాయం ఆర్తులకి అందించకపోగా, పెద్ద సహాయం చేయలేమని వాపోయే వారికిది కనువిప్పు కలిగించే కథ)

## 3. మూడు ఖర్చులు

ఇద్దరు తత్త్వవేత్తలు డబ్బు గురించి ఇలా మాట్లాడుకోవడం కాశీకి వెళ్ళే ఒకతను విన్నాడు.

"లోకంలో ప్రజలు తాము సంపాదించే డబ్బుని దుర్వినియోగం చేస్తున్నారు. కానీ నిజానికి వారు దాంతో కొంత రుణం తీర్చాలి, కొంత రుణం ఇవ్వాలి, కొంత దాచుకోవాలి. కొంత ఎటూ మురుక్కాలవలో కలపక తప్పదు."

"ఔనవును." రెండోవాడు ఒప్పుకున్నాడు.